నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | KARIMNAGAR

## ఉచిత శిక్షణలకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఏప్రిల్ 21: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఎస్బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఉమ్మడి జిల్లాలోని మహిళలకు పలు అంశాల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ సంపత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 5వ తేదీ నుంచి మగ్గం వర్క్, మే 8 నుంచి టైలరింగ్ కోర్సులు ప్రారంభం అవుతాయని, ఉమ్మడి జిల్లాలోని 18 నుంచి 45 ఏండ్లు ఉన్న యువతులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు పదో తరగతి మెమో, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్సులు, పాస్పోర్ట్ ఫొటోతో మే 4 లోపు ఎల్ఎండీలోని సంస్థ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. 9849411002 నంబర్ లో సంప్రదించాలని కోరారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

## సభను విజయవంతం చేయాలి

**పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి**

పెద్దపల్లి, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తెలంగాణ బిడ్డలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సభ మన ఆత్మగౌరవ పండుగ అని, తెలంగాణ బిడ్డల పండుగ అని అభివర్ణించారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ అంటేనే తెలంగాణ బిడ్డల పార్టీ అని, తెలంగాణ ఆత్మగౌరానికి ప్రతీక అని అభివర్ణించారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే సభ యావత్ తెలంగాణ చరిత్రలోనే అత్యంత గొప్ప సభ అవుతుందని చెప్పారు. తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవడానికి, ప్రజల్లో ఒక ఉత్సాహం రేకెత్తించడానికి ఈ సభ ఏర్పాటు చేశామని చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి సుమారు పదివేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలను తరలిస్తామని, అందుకు సంబంధించి వాహనాలు సిద్ధం చేశామని చెప్పారు. ఒక జాతరకు, ఒక తీర్థానికి వెళ్లేవారి లాగ రజతోత్సవ సభకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా ఉన్నారన్నారు. 27న సాయంత్రం 5గంటలకు సభ ఉందని, ఉదయం 11 గంటల నుంచే అన్ని గ్రామాల నుంచి బస్సులు, వాహనాలు బయలు దేరుతాయని చెప్పారు. ఈ సభకు వెళ్లే ప్రజల కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని, మంచినీళ్లు, చల్ల ప్యాకెట్లు, అలాగే భోజనాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి బాలాజీ రావు, పెద్దపల్లి, ఓదెల మండల అధ్యక్షులు మార్కు లక్ష్మణ్, ఐరెడ్డి వెంకట్ రెడ్డి, పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బండారి శ్రీనివాస్ గౌడ్, తానిపర్తి మోహన్ రావు, సయ్యద్ ముబీనుద్దీన్, నిదానపురం దేవయ్య, పూదరి చంద్రశేఖర్, నెత్తెట్ల సతీష్, కమటపు శ్రీధర్, ప్రేమ్, శ్రీకాంత్, బైరం నటరాజ్, అతిక్, ముబాసిడర్, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.





కరీంనగర్ జనరల్ హాస్పిటల్లోని టీ హబ్



విధులు నిర్వహిస్తున్న సీనియర్ టెక్నీషియన్



ఏబీజీ సిరం ఎలక్ట్రోలైట్స్ మిషన్

# టీ హబ్‌కు సుస్తీ

- తరచూ మొరాయిస్తున్న మిషన్లు
- ఫ్రీ మెయింటనెన్స్‌కు నోచుకోక రెండేళ్లు
- ఓవర్‌లోడ్‌తో మరింత సతాయింపు
- రోగుల సేవలకు రోజుల తరబడి బ్రేక్
- వారంలో నాలుగు రోజులు ఆరోగ్య మహిళా సేవలు
- రిపోర్ట్ ఆలస్యంతో చికిత్సలో జాప్యం
- టీ హబ్ వైపు రాని వైద్యులు
- అన్నీ తామే అయి నిర్వహిస్తున్న సిబ్బంది
- పేదల పాలిట శాపంగా మారిన నిర్లక్ష్యం

**కరీంనగర్ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో నెలకొల్పిన 'టీ హబ్' తరచూ సుస్తికి గురవుతున్నది. నిరుపేద రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, వారిపై ఆర్థిక భారం పడకుండా చూడాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ రోగ నిర్ధారణ పరీక్షా కేంద్రం సేవల్లో జాప్యం జరుగుతున్నది. ఫలితంగా పేదలపై ప్రభావం పడుతున్నది. ఐదేళ్లకు డ్యూరేషన్‌పై తెచ్చిన ఎగ్జామిన్ మిషన్లు తరచూ సతాయిస్తూ ఉండడం, ఒక్కో మిషన్ సేవలు రోజుల తరబడి నిలిచి పోవడంతో ఇతర జిల్లాల టీ హబ్‌లకు వెళ్లి పరీక్షలు చేయించాల్సి దుస్థితి ఎదురవుతున్నది. ఆరు నెలలకోసారి మిషన్లకు ఫ్రీ సర్వీసింగ్ ఇవ్వాల్సిన కంపెనీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రభుత్వం పట్టించుకోక పోవడం శాపంలా మారతున్నది. వ్యాధి నిర్ధారణ సకాలంలో జరగకపోవడంతో చికిత్స అందడంలో ఆలస్యమవుతున్నది. ఒక్కో విభాగంలో రెండేసి మిషన్లు ఏర్పాటు చేస్తేనే ఈ పరిస్థితి మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.**



తరచూ మొరాయిస్తున్న ఫుల్లీ ఆటోమేటెడ్ మిషన్

కరీంనగర్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : బీఆర్ఎస్ ప్రభుత్వం 'టీ హబ్' పేరిట రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను ప్రారంభించింది. 2020లో ప్రతి జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానల్లో వీటిని ఏర్పాటు చేసింది. బయో కెమిస్ట్రీ, పాథలాజికల్, మైక్రో బయోలజీకి సంబంధించిన ప్రస్తుతం 57 రకాల పరీక్షలు నిర్వహించి నిరుపేదపై ఆర్థిక భారం పడకుండా చూసింది. అప్పట్లో నెలకు సగటున సుమారు ₹2 కోట్ల పరీక్షలు నిర్వహించి నిరుపేద రోగులకు సేవలు అందించారు. బయోకెమిస్ట్రీ టెస్టుల కోసం అత్యాధునిక సదుపాయాలతో ఉన్న ఫుల్లీ ఆటోమేటెడ్ మిషన్ ఏర్పాటు చేశారు. అందులో కెమికల్ బయో కెమిస్ట్రీకి సంబంధించిన రక్త, మూత్ర పరీక్షల్లో ఏఎల్‌పీ, బీయూఎం, ఎల్‌డీఎల్, ఎఫ్‌బీఎస్, జీజీటీ, జీటీటీ, ఎల్‌హెచ్, ఎల్ఎఫ్టీ, లిపెర్ ప్రొఫైల్, పీఎల్‌బీఎస్, ఆర్‌బీఎస్ (ర్యాండం బ్లడ్ షుగర్), ఆర్ఎఫ్టీ, సిరమ్ టోటల్, సిరమ్ కెంబిల్ రూబిన్ డైరెక్ట్, సిరమ్ హెడీఎల్, సిరమ్ కొలస్ట్రాల్, టోటల్ ప్రొటీన్, యూరిక్ క్యాసిడ్, ఎలక్ట్రో లైట్స్, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ వంటి అనేక నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. హార్మోన్లకు సంబంధించిన టీ-3, టీ-4, టీఎస్‌హెచ్ తదితర పరీక్షలు చేస్తున్నారు. అన్ని రకాల హార్మోన్లు, థైరాయిడ్ పరీక్షలు ఈ మిషన్ ద్వారా పరీక్షిస్తున్నారు. ఇక పాథలాజికల్ విభాగంలో రక్త కణాలకు సంబంధించిన ప్లేట్‌లెట్స్, తెల్ల, ఎర్ర రక్త కణాలను పరీక్షిస్తున్నారు. సీబీపీ, ఏఈసీ, కూంబ్స్ టెస్టు డైరెక్ట్, ఇన్ డైరెక్ట్, డీఎల్‌సీ, ఈఎస్ఆర్, పీసీవీ, టీఎల్‌సీ వంటి అన్ని రక్త కణాలకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాథలాజికల్ విభాగంలోని అన్ని రకాల మూత్ర పరీక్షలు చేస్తున్నారు. ఎలిసా రీడర్స్ మైక్రో బయోలజీ విభాగంలో సైన్‌ఫ్లూ చికెన్ గున్యా పరీక్షలతోపాటు ఏఎస్ఓ, సీఆ





ఆటోమేటిక్ కాగ్లో మీటర్

రీపీ, ఆర్ఎఫ్, ఆర్పీఆర్, టైడీ ఐజీఎం, ఐజీజీ వంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఇక గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నారు. ఈ పరీక్షల కోసం 2020 వరకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ ల్యాబ్‌పై ఆధారపడాల్సి వచ్చేది. టీ హబ్ పేరిట పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ దవాఖానలు, ఏరియా దవాఖానలు, వెల్‌నెస్ సెంటర్లు, ఎంసీహెచ్‌లను అనుసంధానించారు. ఆయా కేంద్రాల్లో ఓపీకి వచ్చే పేషెంట్లకు రక్త, మూత్ర నమూనాలు సేకరించి టీ హబ్‌లకు పంపిస్తే ఇక్కడ రోగుల వ్యాధిని బట్టి పరీక్షలు చేస్తారు. వీటిని ఆన్‌లైన్ చేయడం ద్వారా బయో కెమిస్ట్రీ, పాథలాజిస్టు, మైక్రో బయోలజిస్ట్ వైద్య నిపుణులు పరిశీలించి తిరిగి స్థానిక నిర్ధారణ కేంద్రాలకు నివేదిస్తారు. ఈ నివేదికలు సంబంధిత రోగుల మొబైల్ ఫోన్లకు అటాచ్ చేస్తారు. ప్రతి రోజూ రక్త, మూత్ర నమూనాలను సేకరించేందుకు ఆయా రూట్లలో ప్రభుత్వ వాహనాలను కూడా ఏర్పాటు చేశారు. ఇంత పకడ్బందీగా ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

### మొరాయిస్తున్న మిషన్లు

కరీంనగర్ జనరల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన టీ హబ్‌లో మిషన్లపై అధిక భారం పడుతున్నది. జిల్లాలోని ఒక జనరల్ హాస్పిటల్, 1 ఎంసీహెచ్, 2 ఏరియా దవాఖానలు, 18 పీహెచ్‌సీలు, 6 అర్బన్ హెల్త్ సెంటర్లు, 1 వెల్‌నెస్ సెంటర్ ద్వారా రోజుకు వెయ్యి నుంచి 1,200 వరకు పరీక్షల నమూనాలు వస్తున్నాయి. ప్రతి మంగళ, గురువారాల్లో నిర్వహించే ఆరోగ్య మహిళ పరీక్షలు నిర్వహిస్తారు. వారంలో ఈ రెండు రోజులు 2 వేల నుంచి 2,500 వరకు పరీక్షల నమూనాలు వస్తున్నాయి. టీహబ్‌లో ఉన్న మిషన్ల సామర్థ్యం మేరకు ఒక్క ఆరోగ్య మహిళలో వచ్చిన నమూనాలను పరీక్షించేందుకే వారంలో నాలుగు రోజులు పోతుంది. ఇక జనరల్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించడానికి చాలా టైం పడుతున్నది. మిషన్ల సామర్థ్యం మేరకు పరీక్షలు నిర్వహిస్తుండగా, ఆరోగ్య మహిళ కింద రిపోర్టులు ఇవ్వడానికి రెండు నుంచి మూడు రోజులు పడుతున్నది. జనరల్ రోగులకైతే 24 గంటలు మించుతున్నది. కొన్ని సార్లు అంతకంటే ఎక్కువ సమయం పోతున్నది. ముఖ్యంగా అనేక పరీక్షలు నిర్వహించే ఆటోమేటెడ్ మిషన్‌పై తీవ్రమైన భారం పడుతున్నది. తరుచూ మొరాయిస్తున్నది. ఐదేళ్ల డ్యూరేషన్‌పై అమర్చిన ఈ యంత్రం రోజుకు నాలుగు గంటలు సెల్ఫ్ మెయింటెనెన్స్ చేసుకుంటుంది. ఆ సమయంలో ఎలాంటి పరీక్షలు నిర్వహించదు. 2023 నుంచి ఈ మిషన్ ఫ్రీ సర్వీసింగ్‌కు నోచుకోవడం లేదు. నిత్యం ఏదో ఒక పార్ట్ చెడిపోయి రోజుల తరబడి పని చేయని పరిస్థితి ఉన్నది. సీబీపీ మిషన్‌పై కూడా అధిక భారం పడి తరచూ ఆగిపోతున్నది. ఇది ఆగి పోయినపుడల్లా జనరల్ హాస్పిటల్లోని మెడికల్ కళాశాల ల్యాబ్‌కు వెళ్లి టెక్నీషియన్లు పరీక్షలు నిర్వహిస్తున్నారు. హార్మోన్లు, థైరాయిడ్, విటమిన్ డీ, విటమిన్ బీ12 ఫెరిటెన్ వంటి టెస్టులు చేసే ఇమ్యునో ఎనలైజర్ మిషన్‌పై ఎక్కువగా ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద సేకరించిన నమూనాలను పరీక్షిస్తారు. వారంలో నాలుగు రోజులు ఈ మిషన్‌పై ఎక్కువ భారం పడి సడెన్‌గా ఆగిపోతున్నది. పరీక్షలు నిర్వహించేందుకు రోజుల తరబడి ఆగాల్సి వస్తున్నది. ప్రధానమైన ఈ మూడు మిషన్లు తరచూ సతాయిస్తున్న నేపథ్యంలో సిద్దిపేట, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి వంటి టీహబ్‌లకు నమూనాలు తీసుకెళ్లి పరీక్షలు చేయించాల్సి వస్తున్నది. అయితే అక్కడి హబ్‌లో అవకాశం ఉంటేనే ఇది వీలవుతున్నది. లేదంటే రోజుల తరబడి పరీక్షలు నిలిచి పోతున్నాయి. ఈ పరిణామాలు రోగుల చికిత్సలపై ప్రభావం చూపుతున్నాయి. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సకాలంలో రోగ నిర్ధారణ జరిగితేనే చికిత్స చేసేందుకు అవకాశముంటుంది. కానీ, రోగ నిర్ధారణలో జాప్యం కారణంగా కనీసం మందులు కూడా రాయలేని పరిస్థితి వైద్యులకు ఏర్పడింది. నిజానికి టీ హబ్‌లో మూడు సిఫ్ట్‌ల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. రోజుకు వెయ్యి నుంచి 1,200 నమూనాలను పరీక్షించాల్సి వస్తున్నది. అందులో కనీసం ప్రధానమైన మూడు నాలుగు మిషన్లు రెండేసి ఏర్పాటు చేస్తే రోగులకు సకాలంలో రోగ నిర్ధారణ జరిగే అవకాశాలు ఉంటాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



హార్మోన్ అనలైజర్ మిషన్

### వైద్యులు ఎందుకు ఉండడం లేదు?

తెలంగాణ హబ్ 24/7 పని చేయాల్సి ఉంటుంది. తొమ్మిది మంది ల్యాబ్ టెక్నీషియన్లు, ఒక ల్యాబ్ మేనేజర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, ఫార్మసిస్టుతోపాటు పాథలాజిస్ట్, మైక్రో బయాలజిస్ట్, బయోకెమిస్ట్రీకి చెందిన వైద్య నిపుణులు అందుబాటులో ఉండాలి. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, మరో అసోసియేట్ ప్రొఫెసర్ అందుబాటులో ఉండి పర్యవేక్షించాల్సి ఉంటుంది. వీరంతా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీ హబ్‌లో అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కానీ, ఎప్పుడో ఒకసారి తప్పా వీరంతా ఇటు వైపు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బయో కెమిస్ట్రీ పోస్ట్ ఒకటి వెకెంట్ ఉండగా మిగతా వైద్యులెవరు టీ హబ్‌కు రావడం లేదని, వీరికి ఆన్‌లైన్‌లో రిపోర్టులు పంపిస్తే తప్పా చూడరని తెలుస్తున్నది. వీరిలో ఒక్కొక్కరికి ₹లక్ష నుంచి ₹లక్ష యాభైవేల వరకు జీతాలు ఇస్తున్నట్టు తెలుస్తున్నది. కానీ, విధులకు మాత్రం హాజరు కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యులు విధులకు హాజరై పర్యవేక్షిస్తే నిర్ధారణ పరీక్షల నిర్వహణ కొంత మెరుగయ్యేదని పలువురు అభిప్రాయ పడుతున్నారు



యువజన సంఘం సభ్యులకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

## ఎల్కతుర్తికి తరలిరండి

**కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**

కోరుట్ల, ఏప్రిల్ 21: ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. సోమవారం కోరుట్ల పట్టణంలోని మున్నూరు కాపు యువజన సంఘం, గంగపుత్ర, ముదిరాజ్ సంఘం నాయకులను కలిసి, సభ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్టీ అధినేత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. తెలంగాణ సాధన కోసం ఉద్భవించిన బీఆర్ఎస్ 25 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటున్నామని, ఈ సందర్భ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, మైనార్టీ పట్టణాధ్యక్షుడు ఫహీం, నాయకులు మోసిన్, నగేశ్, సురేందర్, నవీన్, శ్రీపతి, అమీర్, శ్రీనివాస్, శేఖర్, ఆయా కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

## గులాబీదండు కదం తొక్కాలి

**చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

మల్యాల, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గులాబీదండు కదం తొక్కాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం మల్యాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్ఎస్ మండల నాయకులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. అలాగే కొడిమ్యాల మండలం మండలంలోని హిమ్మత్ రావుపేటలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి రజతోత్సవ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. అధినేత కేసీఆర్ నేతృత్వంలో ఈ నెల27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు. గులాబీ శ్రేణులు గ్రామగ్రామనా పార్టీ జెండాను ఆవిష్కరించి, సభకు బయలుదేరాలన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిందని విమర్శించారు. పదహారు నెలల పాలనలో చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు. హామీలపై ప్రశ్నిస్తే కేసులతో భయపెడుతున్నదని మండిపడ్డారు. అయినా బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని స్పష్టం చేశారు. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని చెప్పారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్ రావు, మధుసూదన్‌రావు, బద్దం తిరుపతిరెడ్డి, అయిల్నేని సాగర్‌రావు, జగనం శ్రీనివాస్, సామల్ల దేవరాజం, అల్లూరి అనిల్‌రెడ్డి, తైదల శ్రీలత, ఎడిపల్లి అశోక్, గడ్డం రాజేశం, జోగినిపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించండి

**కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల ధర్నా**

కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 21 : పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు చెల్లించాలని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు పనులు చూపే తమను కూడా క్రమబద్ధీకరిస్తామని, పేస్కేలు అమలు చేయడంతో పాటు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని బడాయి మాటలు చెప్పిందని గుర్తు చేశారు. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడస్తున్నా క్రమబద్ధీకరణ మాట దేవుడెరుగు.. కనీసం వేతనాలు కూడా సక్రమంగా అందజేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీతాలిచ్చి మూడు నెలలు దాటి నాలుగో నెల వస్తున్నదని, తమ కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని వాపోయారు. బుక్కెడు బువ్వ కోసం బంధు, మిత్రుల వద్ద తెచ్చిన చేబదులు కూడా తిరిగి ఇవ్వక, అప్పు కోసం ఇతరుల వద్దకు వెళ్లలేక పస్తులుండాల్సిన దుస్థితి దాపురించిందని కన్నీటి పర్యంతమయ్యారు. తాము పడుతున్న ఇబ్బందులు ప్రజావాణిలో నివేదించి, అధికారులను వ్యక్తిగతంగా కలిసి తమ బాధలు తీర్చాలంటూ వేడుకున్నా ఫలితం కానరాకపోవడంతో రోడ్డున పడ్డామని వాపోయారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులు పట్టుకుని ధర్నా చేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు

## పరీక్షల నిర్వహణకు సహకరించం

**శాతవాహన వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాల యాజమాన్యాల సంఘం వినతి**



వినతి పత్రం అందజేస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం నాయకులు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 21 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో త్వరలో జరగనున్న సెమిస్టర్ పరీక్షలకు సహకరించేది లేదని ప్రైవేట్ డిగ్రీ కళాశాల యాజమాన్య సంఘం తేల్చి చెప్పింది. ఈ మేరకు సోమవారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారికి సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం విడుదల చేయాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదలపై స్పష్టత ఇస్తే గానీ పరీక్షలు నిర్వహించబోమని తేల్చి చెప్పారు. బకాయిలు విడుదల కాక కళాశాలల నిర్వహణ భారంగా మారిందని, అధ్యాపకుల వేతనాలు చెల్లించలేక పోతున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయలు విడుదల చేయించే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే దిశగా తప్పనిసరి పరిస్థితుల్లో పరీక్షల బహిష్కరణ నిర్ణయాన్ని సంఘం రాష్ట్ర శాఖ తీసుకుందన్నారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సుప్మా పరిధిలోని కళాశాలలు పరీక్ష ఫీజులు చెల్లించవని, నిర్వహణకు సహకరించమని సుప్మా రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ జిల్లా కార్యదర్శి శ్రీపాద నరేశ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, అపూర్వ వేణు, ఇంద్రసేనారెడ్డి, రవీందర్, శశాంక్, శ్రీనివాస్, రాజేందర్, కొలనూరు శేఖర్ రెడ్డి, గుగ్గిల జగన్ గౌడ్, ఎన్టీఆర్ భూమేశ్, వేణు కుమార్ పాల్గొన్నారు.



సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

## సైనికుల్లా కదలాలి

**బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు**

మేడిపల్లి, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పల్లెల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికుల్లా కదలాలని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. మేడిపల్లి మండల కేంద్రం పీఎన్ఆర్ గార్డెన్‌లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. రజతోత్సవ సభకు కార్యకర్తలందరూ కలిసికట్టుగా పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. అనంతరం సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, నాయకులు దోనకంటి రాజరత్నకర్‌రావు, చెన్నమనేని రవీందర్‌రావు, మిట్టపెల్లి రమేశ్‌రెడ్డి, మకిలిదాస్, పన్నాల రాజేశ్వర్‌రెడ్డి, దేశవేని కృష్ణ, ముక్కెర గంగాధర్, సోమ నరేశ్, షేక్ హైమద్, వంశీరావు, ఆదిరెడ్డి, సాగర్, అజీత్‌రావు, అజీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 21 : కరీంనగర్ జిల్లాలో మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో రిసోర్స్ పర్సన్స్‌గా పనిచేసేందుకు అర్హత ఉన్న ఉపాధ్యాయ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కరీంనగర్ డీఈవో జనార్దన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, స్కూల్ అసిస్టెంట్, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు ఈ నెల 24 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులను జిల్లా స్థాయి కమిటీ ఇంటర్వ్యూ, డెమో సెషన్ ద్వారా ఎంపిక చేస్తుందని చెప్పారు. పూర్తి వివరాలకు సమగ్ర శిక్షా జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ కే అశోక్ రెడ్డిని సంప్రదించాలని సూచించారు.